## క్లుప్తంగా

### మరిడమ్మకు చండీహోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా వెండి, బంగారు పుష్పాలతో చండీహోమం, పూజా, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్య లోభక్తులు పాల్గొన్నారు.

### వేట నిషేధాన్ని పాటించాలి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న శివరామకృష్ణ

కొత్తపల్లి: వేట నిషేధాన్ని మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ పేర్కొన్నారు. వేట నిషేధంపై అమీనాబాద్ హార్బర్‌లో శనివారం మత్స్యకారులకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15వ తేదీన వరకూ ప్రభుత్వం సముద్రంలో వేట నిషేధాన్ని ప్రకటించారన్నారు. ఈ నిషేధ ఆజ్ఞలను 61 రోజల పాటు సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి సంరక్షణ జరుగుతుందని, ఈ సమయంలో మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోటులతో చేపల వేట చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించి మత్స్యకారలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ఉప్పాడ, అమీనాబాదు, మూలపేట, కోనపాపపేటల్లో 1265 రిజిస్ట్రేషన్ బోట్లు ఉన్నాయి. ఈ వేట నిషేధంపై మత్స్యకార గ్రామాల్లో టాంటాం, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక ప్రగతికి కృషి

సామర్లకోట: మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. శనివారం స్థానిక సంగీతరావుపేట కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణను ఆయన ప్రారంభించారు. నియోజవర్గ పరిధిలో ఏడు కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి శిక్షణా కేంద్రంలోను 150 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కుట్టు శిక్షణ కేంద్రంలోను 25 కుట్టు మిషన్లు ఉన్నాయని వాటిపై ప్రతి రోజు ఆరు బ్యాచ్‌లలో శిక్షణ ఉంటుందన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు కుట్టు మెషీన్ ఉచితంగా అందజేస్తామని చెప్పారు. కుట్టు శిక్షణపై ఆసక్తి కలిగిన మహిళలందరికి శిక్షణ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, బలుసు వాసు, జనసేన నాయకులు పిట్టా జానికిరామారావు, పెంకే వెంకటలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలు పాఠశాలలోనే ఉండాలి



బడి బయట విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఎంఓ తదితరులు

సామర్లకోట: బడి బయట పిల్లలు పాఠశాలలోనే ఉండేలా కృషి చేయాలని సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల పరిధిలో మధ్యలో పాఠశాల మాని వేసిన వారి వివరాలను సేకరించారు. ఈ మేరకు ఆయా విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులలో అవగాహన కల్పించారు. విద్యా సంవత్సరం వృథా కావడం ద్వారా పోయిన కాలం తిరిగి రాదని తల్లిదండ్రులకు సూచించారు. ఈ మేరకు ఉపాధ్యాయులతో పాటు, సీఆర్పీలు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి విద్యార్థులను గుర్తించాల న్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి పుల్లయ్య, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణయ్య, యు మీనామాధురి తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పుటేరులో మత్స్యకారుడి మృతి

కాకినాడ రూరల్: కొవ్వూరు గ్రామం ఎస్సీ పేట సమీపంలో ఉప్పుటేరులో చేపల వేట సాగిస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయి వలలో చిక్కుకున్న మత్స్యకారుడు ముడే గోవిందరాజు(35)మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు వివరాల ప్రకారం.. గోవిందరాజు చేపల వేటకు శుక్రవారం మధ్యాహ్నం ఉప్పుటేరు వద్దకు వెళ్లాడు. సాయంత్రం నీటిలో గోవిందరాజు మృతదేహం కపిపించడంతో మృతుని సోదరుడు నాగశ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మృతదేహం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై సూర్యకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవిలో జరభద్రం!

- అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం
- పరిశుభ్రత అత్యంత అవసరం
- జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి



పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో ఓపీ వద్ద క్యూలో నిల్చున్న రోగులు

పెద్దాపురం: వేసవి కాలం వచ్చేంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు మెల్లగా ఒక్కో వ్యాధి జడలు విప్పడం మొదలు పెడుతుంది. ప్రధానంగా మార్చి, ఏప్రిల్, మే, జూన్‌లలో ఆటలమ్మ (పొంగు, చికెన్ పాక్స్), గవద బిల్లలు, అతిసార తదితర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో ఆసుపత్రుల్లో అధిక సంఖ్యలో రోగులు కనబడతుంటారు. చిన్నపిల్లల్లో సాధారణంగా కనిపించే ఈ వ్యాధులు గాలి, నీరు ద్వారా ఒకరి నుంచి మరొకరి వ్యాపిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు.

**పెద్దాపురం పరిధిలో**

పెద్దాపురం అర్బన్, రూరల్ పరిధిలో ఏరియా ఆసుపత్రి (సీహెచ్ఎన్సీ), అర్బన్ ఆసుపత్రితోపాటు, పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలు ఉన్నాయి. అర్బన్ ఆసుపత్రి పరిధిలో 29 వార్డులు, రెండు పీహెచ్‌సీల పరిధిలో 28 గ్రామాలు, ఏరియా ఆసుపత్రి పరిధిలో పెద్దాపురం మండలంతో పాటు గండేపల్లి, జగ్గంపేట, రంగంపేట మండలాల ప్రజలు వైద్యం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి వస్తుంటారు. ఆయా పరిధిలో పదేళ్ల లోపు చిన్నారులు సుమారు లక్ష పైమాటే. ఈ విషయంలో వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎండ తీవ్రత, నీటి ఎద్దడి కారణంగా తాగునీరు కలుషితమవుతోంది. కలుషిత ఆహారం, తాగునీరు కారణంగా సంభవించే అతిసార ప్రాణాంతకమైనది. వేసవిలో ఈ వ్యాధి కేసులు అధికంగా నమోదవుతుంటాయి. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. గతంలో పెద్దాపురం పట్టణం, కాండ్రకోట, మర్లావ తదితర ప్రాంతాల్లో అతిసార, డయేరియా ప్రబలి సుమారు ఆయా పరిధిలో సుమారు 150 కేసులు నమోదయ్యాయి, అధికార యంత్రంగా అప్రమత్తమై పట్టణ, గ్రామాల్లో సర్వే నిర్వహించి వాటర్ ట్యాంకులను, కాలువలను శుభ్రం చేసి హడావుడి చేశారు. పది రోజుల వరకు ఆయా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితికి తీసుకురాలేని సంఘటనలు ఉన్నాయి. మళ్లీ పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేలా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గవద బిళ్లలు**

గవద బిళ్లలు వ్యాధి సోకితే గొంతి నొప్పి ఉంటుంది. మింగలేని పరిస్థితిలో నిస్సత్తువ, నీరసం, ఆకలి లేకపోవడం, వంటి లక్షణాలు ఉంటాయి. వేడి తీవ్రతతో శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. శక్తిని ఇచ్చే పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలి. ఓఆర్ఎస్ వంటి ద్రవణాలు తీసుకోవాలి.

**విష జ్వరాలు**

కలుషిత నీటిని తాగడం వల్ల టైఫాయిడ్, దోమకాటు ఇతర సమస్యల వల్ల విష జ్వరాలు సోకుతాయి. జ్వరం వస్తే అదే తగ్గిపోతోందనే ఆపోహను వీడాలి. వైద్యులను సంప్రదించి పరీక్షల ద్వారా క్రమ పద్ధతిలో చికిత్స పొందాలి. శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.



సదరం క్యాంపు వద్ద వేచి ఉన్న విభిన్న ప్రతిభావంతులు

**ఆటలమ్మ**

ఈ వ్యాధి వస్తే జ్వరం, నీరసం వచ్చి శరీరంపై ఎర్రటి నీటి పొక్కులు ఏర్పడతాయి. వ్యాధిగ్రస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. వారం నుంచి 14 రోజుల వరకు ప్రభావం చూపుతుంది. ఇది అంటువ్యాధి కావడంతో సోకిన వారు మిగిలిన వారికి దూరంగా ఉండడం మంచిది. వ్యాధి సోకిన పిల్లలను పాఠశాలలకు పంపకూడదు. దురదలు రాకుండా పరిశుభ్రంగా ఉండాలి. ఆటలమ్మ వచ్చిన వారికి కోరినవన్నీ ఇవ్వాలనే అపోహతో అన్ని రకాల తినుండారాలు ఇవ్వడం మంచిది కాదు. తేలికగా జీర్ణమయ్యే పౌష్టికాహారం అందించాలి.

**నాటు వైద్యం ప్రమాదం**

ఆటలమ్మపై అపోహలు ఎక్కువగా ఉన్నాయి. చాలా మంది మూఢ నమ్మకాలతో వైద్యం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. చిన్నపిల్లల్లో వ్యాధి తీవ్రత ఓ మోస్తారుగా పెద్దల్లో అధికంగా ఉంటుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మొదడు, ఊపిరితిత్తులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**అపరిశుభ్ర నీటిని తాగడంతో..**



అతిసార, ఆటలమ్మ, గవద బిళ్లలు, విష జ్వరాలు సోకినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు, వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం చేయింకోవాలి. వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే మంచిది. వేసవిలో దాహర్తిని తట్టుకోలేక అపరిశుభ్రత చల్లని పానీయాలు సేవించడం శ్రేయస్కరం కాదు. శుభ్రత పాటిస్తూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యాధి సోకితే మందస్తు జాగ్రత్తలు పాటించాలి

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

**వైద్యులను సంప్రదించాలి**



ఒకటి రెండు రోజులకు మించి జ్వరం ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. వేసవిలో పిల్లలకు జ్యూసుల రూపంలో ఎక్కువ ఆహారం అందించాలి. సాయంత్రం ఐదు దాటిన తరువాతే పిల్లలను ఆటలకు పంపించడం మంచిది. నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ జగదాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

### నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు విన్నకోట సురేష్ తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, సుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందస్తామన్నారు. పరీక్షకు వచ్చే రోగులు ఉదయం ఎటువంటి ఆహారం తీసుకోకుండా హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 98664 11346కు సంప్రదించాలన్నారు.

### పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఎంప్లాయీస్ సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి చేస్తుందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ పెన్షనర్ల భవనాన్ని బొప్పరాజు వెంకటేశ్వర్లు సందర్శించారు. పెన్షనర్స్ భవనానికి విచ్చేసిన ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్‌కు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్పీ శాస్త్రి, అధ్యక్షులు కె.పద్మనాభం, ప్రధాన కార్యదర్శి నూకరాజులు స్వాగతం పలికారు. ముందుగా పెన్షనర్ల పితామహుడు నగరా విగ్రహానికి బొప్పరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొప్పరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో గత నెల 23వ తేదీన ప్రవేశపెట్టి ఆమోదించిన బిల్లుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పింఛనుదారులకు ఇబ్బంది కలిగిన పక్షంలో ఏపీ జేఏసీ ముందుండి పోరాటం చేస్తుందని పెన్షనర్సుకి భరోసా ఇచ్చారు. పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఢిల్లీలో జరిగే సమావేశానికి హాజరై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లను సంఘ సభ్యులు సత్కరించారు. ఈ సమావేశంలో ఏపీజేఏసీ రాష్ట్ర నాయకులు ఫణిపేర్రాజు, రాజేష్, ఎస్ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రామమోహన్, వెంకటరావు, రాంబాబు, ఆదినారాయణరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- శిథిలావస్థకు చేరిన భవనం
- తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



పాత తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్ తదిరతులు

సామర్లకోట: సుమారు 35 ఏళ్లుగా అద్దె భవనంలో ఉంటున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోనికి మార్పు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానిక బ్రౌన్‌పేటలో సొంత భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండేది. అయితే ఆభవనం శిథిల స్థితికి చేరుకోవడంతో సత్యనారాయణపురంలోని రాజా చిన్నారావు ఫంక్షన్ హాల్ భవనంలోనికి మార్పు చేశారు. సుమారు మూడేళ్ల క్రితం కూల్చివేయడానికి భవన యజమాని నిర్ణయించడంతో మాజేటి నగర్‌లోని అద్దె భవనంలోనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేశారు. పిఠాపురం రోడ్డులోని పాత తహసీల్దార్ కార్యాలయం నిరూపయోగంగా ఉండడంతో ఆ భవనంలోనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆ భవనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయానికి ఈ భవనం ఇరుకుగా ఉండడంతో పాత ఎంపీడీఓ కార్యాలయంలోనికి మార్పు చేసిన విషయం తెలిసింది. అక్కడ నుంచి బలుసులపేటలో నిరూపయోగంగా ఉన్న ఐసీడీఎస్ భవనంలోనికి తహసీల్దార్ కార్యాలయం మార్పుకు రంగం సిద్ధం చేయడం, పాత తహసీల్దార్ కార్యాలయాన్ని ఉపయోగించే అవకాశం లేదు. దీంతో ఆ కార్యాలయంలోనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి సుమారు మూడు వేల వరకు రికార్డులు ఉంటాయి. తహసీల్దార్ కార్యాలయానికే ఆ భవనం సరిపడని పరిస్థితిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏవిధంగా సరి పోతుందనే వాదనలు ఉన్నాయి. అయితే కక్షిదారులు వేచి ఉండడానికి నీడగా చెట్లు ఉన్నాయి. పిఠాపురం రోడ్డులో కార్యాలయం ఉండడంతో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందనే వాదనలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం మార్పు చేస్తున్న ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలోనే నిరూపయోగంగా ఉన్న రూరల్ ఐసీడీఎస్ కార్యాలయ భవనంలోనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుకు అనుమతి ఇస్తే ఉపయోగం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు ఎక్కడికి జరుగుతుందో వేచి చూడాలి.

### ట్రాఫిక్ ఎస్సైకి సత్కారం



ట్రాఫిక్ ఎస్సైని సత్కరించిన దళిత నాయకులు

సామర్లకోట: స్థానిక ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావును దళిత నాయకులు శనివారం రాత్రి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సత్కరించారు. ఎస్సైగా ఆయన విధులు సక్రమంగా నిర్వహించడంతో పాటు యువతకు అనేక అవగాహన కార్యక్రమాలు, ఆటో డ్రైవర్లకు ఖాకీ యూనిఫాం ఏర్పాటు, రోడ్లపై ఉన్న గోతులను పూడ్చి వేత కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న రెలింగ్ కూలిపోయిన ప్రదేశాలలో ఇనుప తీగలు, రిబన్లు ఏర్పాటు చేసి ప్రయాణికులు అప్రమత్తం చేయడంతో సత్కరించినట్లు దళిత సంఘ నాయకుడు గుడాల శంకర్ తెలిపారు.

### రేషన్ వాహనం రాక ఇక్కట్లు



రేషన్ వాహనం రాక పోవడంతో నిరసన తెలియజేస్తున్న రేషన్‌కార్డుదారులు

సామర్లకోట: స్థానిక బలుసులపేటకు రేషన్ వాహనం రాకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు నెలలకు ఒకసారి అయినా ఎండీయూ వాహనం రావడం లేదని, దీంతో రేషన్‌కార్డుదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. వాహనం రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు రేషన్ షాపునకు వెళ్లి రేషన్‌ను తెచ్చుకోవల్సి వస్తోందని, తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. రేషన్ షాపులో కేవలం రెండు రోజుల మాత్రమే రేషన్ ఇవ్వడం వలన రేషన్ షాపు వద్ద పడిగాపులు కావలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనం రాని సమయంలో రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు



చదలాడ మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కొడా చైర్మన్

పెద్దాపురం: నియోజకవర్గ పరిధిలో ప్రస్తుత వేసవి సీజన్లో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కొడా చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మండలంలోని చదలాడ, తిరుపతి, మర్లావ గ్రామాల్లో .జలజీవన్ మిషన్ ద్వానా నిర్మించిన వాటర్ ట్యాంక్‌లను శనివారం వారు ప్రారంభించాచు. ఈ సందర్భంగా చదలాడ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఒబిలిశెట్టి పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఆయా గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మొయిళ్ల కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొత్తెం శ్రీనివాసరావు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, కేదారి నల్లబాబు, కొప్పిరెడ్డి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం



బిందెలతో గోదావరి జలాలు తీసుకొస్తున్న మహిళలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి శనివారం పౌర్ణమిని పురస్కరించుకొని మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో కొత్త అమావాస్య సందర్భంగా ఆలయంలో నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 108 మంది మహిళలచే ఊరేగింపుగా గోదావరి కాలువకు వెళ్లి బిందెలతో నీళ్లు తీసుకొని వచ్చి అభిషేకం చేశారు. ఆలయంలో గరగతో ప్రదర్శన నిర్వహించిన మహిళలు గాంధీచౌక్, యార్లగడ్డవారి వీధి, గోలి వారి వీధి, రథం సెంటర్, స్టేషన్ సెంటర్ మీదుగా రైల్వే గూడ్స్ యార్డు ఎదురుగా ఉన్న గోదావరి కాలువ నుంచి మహిళలు బిందెలతో నీటిని తీసుకొని తిరిగి ఆలయం చేశారు. ఆలయం అర్చకులు సాయి ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహిళలు తీసుకొని వచ్చిన నీటిని అమ్మవారికి జై నూకాలమ్మ, జైజై నూకాలమ్మ అంటూ అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసు, గోలి రాంబాబు, వుండవిల్లి శ్రీనివాసు, ప్రకాశం, సత్తి అరుణలు భక్తులకు సేవలందించారు. అభిషేకాలు అనంతరం మహిళలకు జాకెట్టు ముక్కలు, ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అమ్మవారికి పూలతో పంచారామ క్షేత్ర దీపారాధన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

## ఉపాధి పనులు కల్పించాలి

**ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పిఠాపురం: మండలంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పి.రాయవరంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం సంఘం నాయకులు ఊబా బుల్లబ్బాయి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ నుంచి కూలీల అందరికీ పనులు కల్పించాలని జిల్లా అధికారులు చెప్తున్న క్షేత్రస్థాయిలో కూలీలందరికీ నేటికీ పనులు కల్పించడంలేదన్నారు చేసిన పనులకు గత 11 వారాలుగా ఉపాధి డబ్బులు చెల్లించకపోవడం చాలా దుర్మార్గమని ఉపాధి కూలీలు ఎలా బతుకుతారని బకాయిల చెల్లించకపోతే జీవన ఆధారం ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు వారం వారం ప్లే స్లిప్పులు ఇవ్వాలని, ఉపాధి ప్రాంతంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు, కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులకు కూలి రూ.7కు పెంచి, గ్యాస్ సిలిండర్ పై రూ.50 పెంచడం అన్యాయమన్నారు, ఉపాధి హామీ కార్మికులకు 150 రోజులు పనులు, రూ 400 రోజు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే సింహాచలం నాయకులు రుద్రవరపు భూలోకం, కాల్దారి రాఘవ, సింహాచలం, బత్తుల నాగరాజు, సత్యవతి, దర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రవల్లికా జాయ్ | సాయి జ్యోతి | జయలక్ష్మి | డెల్మా | అజయ్ | సత్యరాజ్యలక్ష్మి | సుధాశ్రీ



చేబ్రోలులో ప్రవల్లిక జాయ్‌ని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం



లీలామహాలక్ష్మి | మధుమతి | సోనియా | జ్యోతి | అమృత | బెస్లీ | చిన్నారి | సునీత

పిఠాపురం: శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగరవేశారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 86 మంది విద్యార్థులు హాజరు కాగా పదికి పైన విద్యార్థులు 90 శాతం పైన మార్కులను సాధించారు. అందులో ఎంపీసీలో జ్యోతుల సాయి జ్యోతి 983, బైపీసీలో ఆకుల అమృత వర్షిని 966 మార్కులతో, సీఈసీలో వడ్లమూరి జయలక్ష్మి 936 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. సెకండ్ ఇయర్‌లో 86 మంది విద్యార్థులకు గాను 57 మంది పాసయ్యి 66 శాతం పెర్సంటేజ్ సాధించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమస్థానం జిల్లాలో మూడో స్థానాన్ని పొందారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు. 2025- 26 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభమైనట్టుగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నీతిపూడి గోవిందు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న ప్రవల్లిక జాయ్ ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 1000 మార్కులకు 971 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించారు.

**పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో**

పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలోను విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాలలో ఈ ఏడాది మొదటి సంవత్సరం ఇంటర్‌లో 295 మంది పరీక్షలు రాయగా 102 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండవ ఏడాది ఇంటర్‌లో 196 మంది పరీక్షలు రాయగా 123 మంది ఉత్తీర్ణులయ్యి 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. గంటా డెల్మా బైపీసీలో 440 మార్కులకు 430, మొదటి ఏడాది సీఎస్‌సీలో బోడపాటి అజయ్ 500 మార్కులకు 477, సెకండ్ ఎంపీసీలో కాపుగంటి సత్యరాజ్యలక్ష్మి, సుధాశ్రీ 1000 మార్కులకు 977 మార్కులు సాధించారు.

**ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు**

కొత్తపల్లి: ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం శనివారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ప్లస్( జూనియర్ కళాశాల) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు 21 మంది పరీక్షలకు హాజరు కాగా 11 మంది ఉత్తీర్ణత (52శాతం)సాధించారు. బైపీసీ విద్యార్థులు 29 మంది పరీక్షలకు హాజరు కాగా 24 మంది ఉత్తీర్ణత (82శాతం) సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు 15 మంది హాజరుకాగా 11 మంది (73 శాతం) సాధించగా, బైపీసీలో 31మందికి 22 మంది ఉత్తీర్ణత (71శాతం) సాధించినట్లు పాఠాశాల ప్రధానోనాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లాలోనే మూలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలోని విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత, మార్కులు సాధించారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలల కంటే అత్యధిక ఉత్తీర్ణత శాతం మార్కులు సాధించి జిల్లా, నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎం.లీలామహాలక్ష్మి 429, ఆర్.మధుమతి 413 బైపీసీలో ఎస్.సోనియా 429, జి.జ్యోతి 415, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఆర్.అమృత 939, పి.బెస్లీ 913, బైపీసీలో ఆర్.చిన్నారి 966, జి.సునీత 943 మార్కులు సాధించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు

సామర్లకోట: పట్టణ పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో స్వామి వారిని అలంకరించి పూజలు చేశారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయంలోను, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలోను, రాజీవ్ గృహకల్ప వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో 65 అడుగుల ఎత్తైన ఆంజనేయ స్వామి వారికి తమల పాకులు, వివిధ రకాల పూలతో అభిషేకాలు చేశారు.